క్లుప్తంగా

నిర్ణీత సమయంలో అర్జీల పరిష్కారం



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

సీటీఆర్ఐ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి, నిబంధనల మేరకు అర్జీదారుడికి న్యాయం చేయాలని ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం 'పీజీఆర్ఎస్ – మీ కోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ స్థాయి అధికారులతో కలసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు ఐదు అర్జీలను అందజేశారన్నారు.

26న మెగా జాబ్‌మేళా

సీటీఆర్ఐ: ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఈ నెల 26న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తిలక్ రోడ్డులోని కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరాన్ని ఐటీ హబ్‌గా తీర్చిదిద్దాలని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చానని, దాన్ని నిలబెట్టుకోవడానికి కృషిచేస్తున్నానన్నారు. దానిలో భాగంగా తన ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా చైతన్యబాబు



రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా కొప్పిశెట్టి చైతన్య బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ పోలవరం ప్రాజెక్టు ఎల్ఎంసీ కెనాల్ డిప్యూటీ తహసీల్దార్ సాయిప్రసాద్ ఇన్‌చార్జి ఎన్నికల డీటీగా పనిచేశారు. చైతన్య బాబు మాట్లాడుతున్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల విధులను సమర్థంగా నిర్వహిస్తానని తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

కడియం: మురమండలో మాచరమ్మ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. సుమారు 123 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయం శిథిలస్థితికి చేరుకుంది. ఈ నేపథ్యంలో ప్రత్తిపాటి వెంకట జనార్దన్ చౌదరి, వీరభద్రేశ్వరి దంపతుల చేతుల మీదుగా వేదపండితుల సమక్షంలో సోమవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించి, శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్బన్‌లో ప్రత్యేక పోలీసు బృందాలు

కంబాలచెరువు: అసాంఘిక శక్తుల కార్యకలాపాలను అణచివేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ అర్బన్ పరిధిలో ఆరు స్పెషల్ పార్టీలు, ఒక మహిళా రక్షక్ టీంతో రాత్రి వేళల్లో పటిష్టమైన గస్తీ నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి రోజూ రాత్రి సమయంలో రెగ్యులర్ నైట్ బీట్లతో పాటు ఈ ఏడు స్పెషల్ టీమ్‌లు పనిచేస్తాయన్నారు. వారాంతంలో అదనంగా ప్రత్యేకమైన బీట్లు, క్రైమ్ బీట్లు పనిచేస్తాయన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ రాజమహేంద్రవరం డివిజన్‌లోని రాయుడుపాకలు, హెచ్‌టీడీసీ లేఅవుట్, కోలమూరు ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు.

సినిమాలు

శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జిగ్రా
సూర్యప్యాలెస్	: ఇద్దరు
శివజ్యోతి	: మార్టిన్
అనుశ్రీ	: జనక అయితే గనక
స్వామి	: శ్వాగ్
అశోక	: విశ్వం
రాజా	: మార్టిన్
రంభ	: రాధేకృష్ణ, మా నాన్న సూపర్ హీరో
ఊర్వశి	: సత్యం సుందరం
మేనక	: కల్లు కాంపౌండ్, మార్టిన్
కుమారి	: దేవర
అప్సర నామవరం	: దేవర
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: వేట్టయన్, విశ్వం
మురళీకృష్ణ కడియం	: దేవర
వెంకటసూర్య	: దేవర, వేట్టయన్

దళారుల దండయాత్ర

- ఇసుక ర్యాంపులో యథేచ్ఛగా తవ్వకాలు
- ట్రాక్టర్ ఇసుక రూ.3 వేలకు విక్రయం
- చంద్రబాబు ప్రకటనతో దోపిడీకి స్కెచ్
- లబోదిబోమంటున్న ఇళ్ల నిర్మాణ దారులు



ఇసుక కోసం వేమగిరి - కడియపులంక ర్యాంపునకు వచ్చిన ట్రాక్టర్లు

కడియం: కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన ఉచిత ఇసుక పథకం దళారులకు, ఆ పార్టీల నాయకులకు వరంగా మారింది. ఆ పేరుతో అందినంతకాడికి దండుకుంటున్నారు. పేరుకు ఇసుక ఉచితమే అయినా ప్రజల దగ్గరకు వచ్చేసరికీ అత్యంత ఖరీదుగా మారుతోంది. ప్రస్తుతం ఇసుక సరఫరా లేక భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పనులు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై వారందరూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ అప్రతిష్ఠను తొలగించుకునేందుకు తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఓ ప్రకటన చేశారు. నదులకు దగ్గరగా ఉన్నవారు ట్రాక్టర్లు, ఎడ్లబళ్లపై ఇసుకను తవ్వి తీసుకువెళ్లవచ్చని ప్రకటించారు. దీంతో మరో దందాకు తెరలేచింది.

రంగంలోకి దళారులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనను దళారులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో సమీపంలోని ఇసుక ర్యాంపుల్లోకి ప్రవేశించి విచ్చలవిడిగా తోడుకుంటున్నారు. అనంతరం అవసరమైన వారికి ట్రాక్టర్‌ను రూ.3 వేలకు విక్రయిస్తున్నారు. దీంతో ఇప్పటికే ఉచిత ఇసుక పేరుతో తలకు బొప్పికట్టిన సామాన్యుడు మరోసారి లబోదిబోమంటున్నాడు.

150కి పైగా ట్రాక్టర్లు

వేమగిరి - కడియపులంక ఇసుక ర్యాంపులో సోమవారం దాదాపు 150కి పైగా ట్రాక్టర్లు వచ్చి ఇసుక తవ్వుకుని తీసుకువెళ్లినట్టు స్థానికులు అంచనా వేస్తున్నారు. వీరంతా ఎవరని విచారిస్తే ద్వారపూడి, కేశవరం, అనపర్తి తదితర ప్రాంతాలకు చెందిన వారని తేలింది. ఇక్కడికొచ్చి ఇసుక ఎందుకు తీసుకువెళుతున్నారని ప్రశ్నిస్తే ట్రాక్టర్ మూడు వేల రూపాయలు మాత్రమే, కావాలంటే మీకు కూడా అమ్ముతామంటూ చెప్పడంతో స్థానికులు ముక్కున వేలేసుకున్నారు.

కుదేలైన నిర్మాణ రంగం

నిజానికి తగిన ఇసుక అందుబాటులో లేక నిర్మాణ రంగం కుదేలైంది. దీనిపై ఆధారపడిన కార్మికులు పనులు లేక దిక్కులు చూస్తున్నారు. అయితే నిర్మాణాలు చేసుకునే లబ్ధిదారులకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు అందుబాటులో ఉండవు. వాటిని అద్దెకు మాట్లాడుకుని, ఎగుమతి చేసే మనుషులకు కూలి చెల్లించి ర్యాంపులోంచి ఇసుకను తెచ్చుకోవడం వారికి సాధ్యం కాదు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయాలేమీ పట్టించుకోకుండా ఇసుకను తవ్వి తీసుకువెళ్లండి అని ప్రకటించడం హాస్యాస్పదమని పలువురు విమర్శిస్తున్నారు.



వేమగిరి - కడియపులంక ఇసుక ర్యాంపులో ఇసుక తవ్వకాలు

నిబంధనల ఉల్లంఘన

సాధారణంగా ఎడ్లబళ్లను వ్యవసాయ పనులకు ఉపయోగిస్తారు. కానీ ఇప్పుడు వాటికి అసలు డిమాండ్ లేదు. ట్రాక్టర్లు రావడంతో అవన్నీ మరుగునపడ్డాయి. దీంతో కొందరు ఎడ్లబళ్లను ఇసుక రవాణాకు వినియోగిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు తమ కూలిపనికి అనుగుణంగా సరసమైన ధరకు ఇసుకను లబ్ధిదారులకు అందిస్తున్నారు. దీనివల్ల ఎడ్లబండ్ల యజమానులతో పాటు ఇసుకును కొనుగోలు చేసేవారికీ ప్రయోజనం కలుగుతుంది. వీటి ద్వారా రోజుకు రెండు, మూడు ట్రిప్పులు మాత్రమే వేసే అవకాశం ఉంది. కానీ ఇసుక ర్యాంపుల్లోకి ట్రాక్టర్లకు కూడా అనుమతించడంతో ఎడ్లబండ్ల యజమానుల ఉపాధికి గండి పడింది. పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లు రావడంతో వీరికి గిరాకీ లేకుండా పోయింది. ట్రాక్టర్లతో వీరు పోటీపడలేక పోతున్నారు. అలాగే ఎటువంటి నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా ఇసుకను తవ్వేస్తున్నారు.

రూ.3 వేలు చెబుతున్నారు

ర్యాంపు నుంచి ఇసుకను తెచ్చి ఇచ్చేందుకు రూ.3 వేలు అడుగుతున్నారు. దాని పరిమాణం సుమారు ఒక యూనిట్ వరకూ ఉండవచ్చు. ఇసుక ర్యాంపులోకి వచ్చిన ట్రాక్టర్లలో కడియం మండలానికి చెందిన ఒకటి, రెండు మాత్రమే ఉన్నాయి. మిగిలిన బయట ప్రాంతాల వారివే.

– కె.భద్రరావు, కడియపులంక

దళారుల దందా

ఇల్లు కట్టుకునేవారికి ట్రాక్టరు ఉంటుందన్న గ్యారెంటీ లేదు. ఒక వేళ ట్రాక్టర్‌ను అద్దెకు తీసుకున్నా, కూలీ ఖర్చులతో కలిపి తడిసిమోపెడు అవుతుంది. ర్యాంపులోంచి ఇసుకను తెచ్చి అమ్మకాలు సాగించడం దళారులకే సాధ్యం. ఈ విధానం కూడా ఒకరకంగా వారిని ప్రోత్సహించడమే.

– బి.సత్యనారాయణ, కడియపులంక

చంటియ్య మృతి తీరని లోటు



చంటియ్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) మృతి తీరని లోటని పలువురు అన్నారు. చంటియ్య మృతికి సోమవారం పెద్ద ఎత్తున ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. కడియపులంకలోని చంటియ్య స్వగృహంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుమారుడు పెద సత్యనారాయణతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావిపాటి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

ఇసుకలో అవకతవకలు జరిగితే చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత ఇసుక రవాణాలో అవకతవకలు జరిగినట్లు గుర్తించినా, గుర్తింపు ఇవ్వని రీచ్‌లలో తవ్వకాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు హెచ్చరించారు. ఈ మేకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని 16 రీచ్‌లలో ఇసుక తవ్వకాల కోసం అనుమతులు మంజూరు చేశామన్నారు. ఓపెన్ రీచ్ పాయింట్ల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ యంత్ర పరికరాలు ఉపయోగించరాదన్నారు. బోట్స్ మ్యాన్ సొసైటీ సభ్యులకు రుసుము చెల్లించడం జరిగిందని తెలిపారు. తవ్వకాల చార్జీలు, ఆశీల వసూలు, ర్యాంపు చార్జీలు అంటూ నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అటువంటి ఘటనలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించడం జరగదన్నారు. ఇప్పటికే 44 బోట్స్ మ్యాన్ సొసైటీలకు అనుమతి ఇచ్చామని, మరో 75కు అనుమతులు జారీ చేసి, నిబంధన ప్రకారం ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో కేటాయింపు జరిపే ప్రక్రియ చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ఉచిత ఇసుక పాలసీ అమలు విధానంలో ట్రాక్టర్లకు అనుమతులు ఇస్తున్నామన్నారు. జిల్లా యంత్రాగం గుర్తింపు ఇచ్చిన ప్రాంతాలలో మాత్రమే పరిమితులకు లోబడి అనుమతులు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేసే విధానంలో ఇంటి నిర్మాణం, మరమ్మతుల కోసమే తీసుకువెళ్లాలన్నారు. నిల్వ కోసం, డంపింగ్ కోసం తీసుకువెళ్లడం కుదరదని స్పష్టం చేశారు.

'పల్లె పండుగ'తో గ్రామాల పురోగతి



కడియపులంకలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

కడియం: గ్రామాల పురోగతి కోసమే రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం మురముండలో రూ.13 లక్షలతో రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కడియపులంకలో 2.49 కోట్లతో నిర్మించే రోడ్లు, డ్రైనేజీ పనులను ప్రారంభించారు. సంక్రాంతి లోపు ఈ పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కడియం మండలానికి మూలాధారమైన నర్సరీ వ్యవస్థను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, టీడీపీ, జనసేన నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా.. కడియపులంకలోని టూరిజం భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం ప్రారంభించారు.

స్వర్ణాంధ్ర సేవలు స్ఫూర్తిదాయకం



సీతా మాణిక్యాన్ని సన్మానిస్తున్న గుబ్బల రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: అన్నార్తుల ఆకలి తీర్చడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పించటానికి స్వర్ణాంధ్ర సంస్థ స్ఫూర్తిదాయకమైన సేవలు అందిస్తోందని ఆంధ్ర యూనివర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ సీతా మాణిక్యం ప్రశంసించారు. లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతా మాణిక్యం మాట్లాడుతూ స్వర్ణాంధ్ర రాంబాబు చేస్తున్న అన్నదాన సేవలకు అందరూ మరింత సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది, సీపీ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

పెదపూడి: రెండు చోరీ కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేశామని అనపర్తి సీఐ వీఎల్‌వీకే సుమంత్ తెలిపారు. అనపర్తిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అనపర్తిలోని ఎంపీడీఓ ఆఫీస్ ఎదురుగా డి.వెంకట ప్రసాద్, వెంకటలక్ష్మి జ్యూవెలరీ వర్క్‌షాపులో గత నెల 28న, అలాగే కుతుకులూరు గ్రామంలోని పి.వెంకటరెడ్డి ఇంట్లో ఈనెల 10వ తేదీన బంగారం, వెండి వస్తువులు మాయమయ్యాయి. బాధితుల ఫిర్యాదుల మేరకు ఎస్సై ఎల్.శ్రీనునాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో చోరీలకు పాల్పడిన రాయవరం మండలం వెదురుపాక రాయవరం గ్రామానికి చెందిన కట్టా శివ శంకర్‌ను ఈ నెల 20న అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి 211 గ్రాముల వెండి, 12 గ్రాముల బంగారం ఆభరణాలు రికవరీ చేశారు. నిందితుడిపై సుమారు 50 వరకూ కేసులున్నట్టు వెల్లడించారు. అతడిని అరెస్ట్ చేసి అనపర్తి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించిందని, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు.

మూడు నెలలుగా జీతాల్లేవు



ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లకు వినతి పత్రం అందజేస్తున్న 108 ఉద్యోగులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మూడు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని 108 ఉద్యోగులు ఆవేదన చెందారు. రాష్ట్ర పిలుపులో భాగంగా 108 జిల్లా కమిటీ సభ్యులు సోమవారం స్థానిక డీఎంహెచ్‌వో, ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్, 108 జిల్లా మేనేజర్లను వినతిపత్రాలను అందజేశారు. వారు మాట్లాడుతూ తమ సమస్యను అనేక సార్లు యాజమాన్యం దృష్టికి తీసుకు వెళ్లినా పరిష్కారం కావడం లేదన్నారు. జీతాలు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అయినా విధులకు అంతరాయం కలగకుండా నిబద్ధతతో పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎ.నాగ వెంకట రమణ, జిల్లా జనరల్ సెక్రటరీ జి.రమేష్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ జొన్నకూటి నానాజీ, ట్రెజరర్ జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీసు అమర వీరులకు నివాళి



అమర వీరులకు గౌరవ వందనం చేస్తున్న పోలీసులు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్, కలెక్టర్ ప్రశాంతి



కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆధ్వర్యంలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకున్నారు. అమర వీరులకు స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తదితరులు మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణలో పోలీసులు ఎంతో కీలకమన్నారు.

– కంబాల చెరువు

పీజీ విద్యార్థిని పల్లవి మృతికి సంతాపం



పల్లవి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

రాజానగరం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఆదికవి నన్నయ యూనివర్సిటీ పీజీ విద్యార్థిని కుంచె పల్లవి (27)కి సహ విద్యార్థులు, అధ్యాపకులు సంతాపం తెలిపారు. రాజమహేంద్రవరంలోని హుకుంపేట వరలక్ష్మి కాలనీకి చెందిన పల్లవి స్నేహితురాలితో కలిసి బైకుపై యూనివర్సిటీకి వస్తుండగా లాలాచెరువు వద్ద ఆర్టీసీ నాన్ స్టాప్ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం యూనివర్సిటీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సంతాప సభ నిర్వహించారు. పల్లవి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనివర్సిటీ ఒక మంచి విద్యార్థినిని కోల్పోయిందన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ నివాళులర్పించారు. రోడ్డుపై ప్రయాణాలు చేసే సమయంలో ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ముఖ్యంగా బైకులపై ప్రయాణించేవారు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూరల్ తహసీల్దార్‌గా జయసూర్యకుమార్



రాజమహేంద్రవరం రూరల్: మండల తహసీల్దార్‌గా పీవీవీ జయసూర్యకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గత మూడు నెలలుగా ఇక్కడ తహసీల్దార్ లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జయసూర్యకుమార్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ సేవలను త్వరితగతిన అందించడానికి కృషి చేస్తానన్నారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ ఏ.రాజాబాబు, ఎన్నికల డీటీ కొప్పిశెట్టి చైతన్యబాబు, మండల సర్వేయర్ భువనేశ్వరరావు, ఆర్ఐ అంకం ప్రసాద్, వీఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వర్షంతో వాహన చోదకుల అవస్థలు



వర్షం కారణంగా మోరంపూడి ఫ్లైఓవర్ కింద ఆగిన వాహనచోదకులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంతో పాటు పరిసర ప్రాంతాలలో సోమవారం సాయంత్రం మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు రెండుగంటల పాటు కురిసిన వానకు ఎక్కడికక్కడ స్తంభించిపోయారు. వర్షం తగ్గేవరకూ మోరంపూడి జంక్షన్‌లో ఫ్లైఓవర్ కింద వాహనచోదకులు నిరీక్షించారు. కాగా.. చిరు వ్యాపారాలు అమ్మకాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

గ్రామసభలను వినియోగించుకోవాలి



గ్రామసభలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్: రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ మత్సేటి ప్రసాద్ అన్నారు. బొమ్మూరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ ఏ.రాజాబాబు అధ్యక్షతన సోమవారం గ్రామసభ జరిగింది. రాజాబాబు మాట్లాడుతూ గ్రామసభకు రైతులు 14 అర్జీలు ఇచ్చారని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. మద్దిపోటి శంభాజీరావు, మాజీ ఉప సర్పంచ్ కామిని ప్రసాద్ చౌదరి, పంచాయతీ కార్యదర్శి జి.కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

మహా ప్రవక్త మహ్మద్ జీవితం ఆదర్శప్రాయం



మాట్లాడుతున్న మౌల్వీ మహ్మద్ సిరాజ్

సీతానగరం: మహా ప్రవక్త మహ్మద్ జీవితం ఆదర్శప్రాయమని కమ్యూనిటీ జిల్లా ఇన్‌చార్జి మౌల్వీ మహ్మద్ సిరాజ్ అన్నారు. వంగలపూడిలోని అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ మసీదులో సోమవారం సమావేశం నిర్వహించారు. కమ్యూనిటీ ఉపాధ్యక్షుడు షేక్ వజీరుద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ సర్వమత అవతార పురుషులను గౌరవించుకున్నప్పుడే ప్రపంచంలో శాంతి నెలకొల్పవచ్చన్నారు. వంగలపూడి మసీదు గురువు మౌల్వీ మహ్మద్ అక్బర్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎంతో క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటోందని, మూడో ప్రపంచ యుద్ధం వైపునకు వేగంగా వెళుతోందన్నారు. మహ్మద్ ప్రవక్త ఇస్లాం అంటే శాంతి అని బోధించారని గుర్తు చేశారు.